# "మీమాంస"

ఆతన్ని చూడగానే ఎంతో జాలివేసింది. నాకన్న అట్టే ఎక్కువ వయసు ఉండదు. నాకన్న ఎన్నో రెట్లు కనుముక్కుతీరు బాగున్నది. నాకన్న తెలివితేటలు గల నాజూకైన కవళిక.

తగని నీరసంగా కనబడుతున్నాడు. మాటలో నిలుచో లేక తూలిపోతూ అడుగు బలవంతాన నిలుపుకుంటున్నాడు. చేజారుగా చెరిగి దుమ్ముకొట్టుకు పొడిఆరినజుట్టూ, గరగర లాడేగడ్డం, మాపుపేరుకుని నలుగుడులో పెళపెళలాడుతూ పెళుసెక్కిన, ముదుకపంచా, గుండీలులేని లాల్చీ.

వెనుకనుంచి నాకోసం తొందరగా నడచివచ్చి నన్ను కలుసుకుని నెమ్మదిగా, మర్యాదగా పలుకరించాడు. అంతకు ముందు, త్రోవలో ఎగువను, చూసినప్పుడు ఎన్నికగా

జ్ఞాపకం ఉంచుకోవలసిన పోలిక ఏమీ కనబడలేదు. ఇప్పుడు యిందాక గుడిదగ్గర చెట్టునీడను దిక్కులుచూస్తూ నిలుచున్న అతడు అని పోల్చుకున్నాను.

ఆవాలకంలో యాచనకు ముందు నడచే దైన్యం నాకు గోచరించింది. కాని ఎందుచేతనో, జేబులో కానీకోసం చిల్లరలో తడిమే చెయ్యి అలా అక్కడే తటపటాయిస్తూంది. మామూలు బిచ్చగానిలాగా ఆతనికి ధర్మం చేయటానికి, చెయ్యి తెమిలిరాలేదు.

'ఏమి'టని ప్రశ్నగా తలకాంచెం కదలించాను. అతడు అభిమానం చంపుకుని యింకొకరి యెదుట చేయి జాపవలసినందుకు తాను లోలోపల అణచుకోలేని బాధ అక్షరమక్షరంలోనూ తనకు మితిమీరిపోగా కనబరచాడు.

అంతా విని అయ్యో పాపం అనుకున్నాను.

భార్య ఇప్పుడో ఇంకో నిమిషానికో ప్రసవించుతుంది, చూసేదిక్కు లేదు. ఉండేందుకు చోటులేదు. ఆస్పత్రికి తీసుకువెళ్ళాలి. అందుకు వద్ద కానీ అయినాలేదు. ఎప్పుడూ ఎవరినీ అడిగినవాడుకాదు. అడిగితే అవతలవాడు లేదు పొమ్మంటే అప్పుడు తల తీసేసినట్లవుతుంది. అందుకోసమని ఏమీ పాలుబోక ఎవరన్నా దేవుడల్లే కనబడి యీ ఆపద అడ్డుకోలేకపోతాడా, దైవం తనపాలిట ఉండదా అనే ధైర్యంతో దైన్యంతో అక్కడ యిందాక నేను చూచినచోట ఎంతసేపటినుంచో నిలుచుని ఉన్నాడు. నన్ను చూడగానే అదివరకు నా మొగమైనా ఎరుగకపోయినా ఎందుకో ప్రాణం

లేచివచ్చింది, తగని ధైర్యం వచ్చింది. తాను ఇక్కడ ఇలా తిప్పలు పడుతూంటే అక్కడ ఆ పిల్ల పాపం ఏమయిందో!

అతనికళ్లు నీళ్ళతో నిండిపోయినవి. తుడుచుకునేందుకని పిడికిలిపట్టి ఎత్తిన చేతులను పట్టుకుని గుప్పిట విడదీసి నా పర్సుతీసి అందించి, వెళుతూన్న జట్కాను నిలవేసి అందులో ఎక్కించి పంపించివేశాను.

నేను చేసినది నా తాహతుకు ఓ ఘనకార్యం కాదు. కాని పనికి ఏచాయలనూ పోలికలేని సంతోషం నన్ను ముంచెత్తింది. అతని ఆపదలకు అడ్డుపడగల కలిమి మా పెద్దల పుణ్యాన నాకు పుట్టుకతో అబ్బినందుకు అప్పుడు వారందరికీ మనసులో నమస్కరించాను.

నేను ఇచ్చిన తృణమోపణమో ఆతనికి పుష్కలంగా చాలును. ఆ పిల్లది సుఖంగా రాజాంగంగా పురుడుపోసుకుని ఆమీద నాలుగు నెలలపాటు దేనికీ వెదుక్కోకుండా వాళ్ళందరూ గడపవచ్చును. ఆపదలు ఎప్పుడూ కాపురాలు చేయవు కదా? ఆత డెల్లకాలమూ యీ తీరుననే ఉంటాడా? ఏదన్నా కలిసిరాదా! యీలోపున ఏమో ముందు ఏది ఎలా జరుగవలసిఉన్నా యిప్పుడికేమీ ఫరవాలేదు. ఆ దంపతులు ఇక ఎప్పుడూ దీపం పెట్టుకుని నన్ను తలచుకుంటారు. నేనుచేసింది అది అంతా నాకు ఘనకార్యం కాకపోయినా అదేవాళ్ళకు మేరుపర్వతం. ఎన్నడన్నా మళ్ళా ఆతడు కనబడితే అప్పటికి మంచి స్థితిలో ఉండి...తప్పక ఉంటాడు. ఎప్పుడు యిలాగే ఉంటాడా?...నన్ను ఆకాశానికి ఎత్తిపట్టి హంగామాచేస్తే

ఆలాంటి వేషమీ నాకు ఎంతమాత్రమూ ఇష్టంలేవు...యిరకట పడి...సరే అందాకా వచ్చినప్పుడు చూసుకోవచ్చును. ఇవాళమటుకు లేచిన వేళ చాలామంచిది.

నడుస్తూంటే నాలో ఈ ఊహలన్నీ గిరగిర తిరుగుతున్నాయి. ఉత్సాహం హెచ్చిపోతూ అడుగు ఊతంగా పడుతూంది. ఆ రాత్రి బ్రహ్మానందంగా నిద్రపోయినాను.

—మెయిలు వేళకు రాలేదు. అందులో వస్తున్నానని టెలిగ్రాం యిచ్చిన మావాడు రాలేదు. కలుసుకునేందుకు వెళ్లకపోతే యేమనుకుంటాడో, రాకరాక వస్తున్నాడని, మామూలుకన్న తగని పెందరాళే లేచి వేగిరం సీమా జామా వేసుకుని వచ్చి పడిగాపులు కాసిన చిరాకుతో బాటు బయట అప్పుడే ఎండ చురచుర మంటూంది.

గొంతు తడుపుకుని ఇక ఆమీద కార్యక్రమం ఆలోచించవచ్చును గదా అని ఆర్ ఆర్ లోపలికి వెళ్ళాను.

—బల్లకు ఆవలివేపున నాకు ఎదురుగుండా కుర్చీలో జారగిలపడి సిగరెట్ పట్టిన చెయ్యి వేలంటా జారవిడిచి మత్తుగా కళ్లు మూసి మూయనట్లుగా అతను కనపడ్డాడు.

మనిషిని పోలిన మనిషని మొదట వింతగా ఆవేపు చూశాను. మళ్లా చూడగా అవునేమో అని అనుమానం వేసింది. అయినా రూఢిచేసుకోలేదు. మనసులో అతడు ఇలా రావడానికి ఏలా...కలలోఅయినా తలచలేని సంగతి.

ఆలోచన తెగకపోయినా అతని ఎదుట కుర్చీలో కూర్చుని పరకాయించకుండా ఓ కంట కనిపెడుతూ, బీర్

ఒక్కొక్క పట్టు పడుతూ, సిగరెట్ గుక్కలాగుతూ తెగించి చూసి తేల్చుకోలేకపోతూ నాలో నేను తికమక పడుతున్నానే కాని విడవకుండా చూస్తూ నేడున్నాను.

నన్ను చూసి మొగం అదేలాగో చేసుకుని పలుకరింతగా చిరునవ్వు తెప్పించుకుంటూ లేచి సాఫీగా కూర్చున్నాడు.

"మీరు బైబిల్ చదువుకున్నారా?"

—ప్రశ్న అంతా అర్థమయి మెదడుకు పట్టేలోగానే 'అవును' కనుక ఆలాగున తల ఊపాను.

"డేవిడ్ ఏంచేశాడు? జ్ఞాపకముందా?"

...ఏం చేశాడు? యుద్ధాలు చేశాడు. ఎదురించిన వాళ్ళతో నల్లా ఎంతమందినో చేసుకున్నాడు. ఇంకా...మరి ఊహుఁ...చదివినదంతా మళ్ళా నెమరుకు తెచ్చుకుంటున్నా. ఆతడు అడిగినదానికి సరిపోయే జవాబు దొరకడంలేదు. అదీ అర్థంకాక ఆతని ఆ నడవడీ అర్థంకాక నాచేతగాని ఉడుకు మోతుతనము, అరికాలిమంటను రెచ్చగొట్టి నెత్తికెక్కిస్తూ న్నది.

పట్టుకుని, ఛడామ్మడా దులుపుదామనుకున్నాను నోరు చేసుకుని.

'ఏంచేశాడు ఆ కొడుకు అలా చచ్చిపోయినప్పుడు?'

మబ్బు విడిపోయినట్టుగా కొట్టిచెప్పినట్టు అర్థమయింది. కాని, హరిహరీ ఆతనికంత అన్యాయం జరుగరాదు. నాదానం పనికిమాలినది కారాదు.

గుండె తరుక్కుపోతూంది. అతన్ని చూడగా, అతను అవునని బరువుగా తల ఊగించాడు;- పాపం, బ్రతికించుకో లేకపోయినాడు. ఎంద రెన్నివిధాల సాయపడితేనేం తా నొకటి తలచినా దైవ మింకోటి తలచాడు. అది చూడలేక అక్కడ ఉండలేక అందుకు కావలసినదంతా అక్కడివాళ్ళకు యిచ్చి...

ఆమెకోసమేకదా, రక్షించుకుందామనేకదా, కలసి ఎన్నటికైనా కష్టాలు మరచిపోయి, సుఖపడలేమా అనేకదా ఎన్ని అగచాట్లుపడినా ఆమె లేకపోయిన తరువాత ఇక తనకు ఏంకావాలి! ఏ దైవమూ అడ్డుపడలేదు. పడదు. కావలసిన కారణార్థం అలా ఉండగా ఎవరికర్మకు ఎవరు కర్తలు?

అంత దారుణం జరగడం, నిజంగా అతని విషయంలో చాలా అన్యాయం. ఇచ్చిన దేవుడు పది కాలాలపాటూ ఎందుకు మరచిపోలేడూ? ఆలాటివాళ్ళకు అదే పదివేలే, కడుపు మాడుతూన్నా కష్టమూ నిష్ఠురమూ కలసి అనుభ వించడానికైనా నోచుకోనందుకు ఆత డిది అంతా ఏనాడు చేసిన పాపమో!

త్రాగనీ, అంతకన్న అతడు చేసేదిలేదు. త్రాగి తనను తాను మరచిపోలేకపోతే, తనకు తాను దక్కడు, ఎవడైనా ఆపదలు తలకు మీరినవైనప్పుడు.

ఆతనిని నా అతిథినిగా చేసుకుని అదమరచేటట్టు ఆరగా ఆరగా ఎక్కసమై భరాయించుకోలేనంతదాకా త్రావించాను. కైపు మోపవుతున్నకొద్దీ ఆతని ముఖంలోకి

కళాకాంతులు వస్తూన్నవి, చాలా పై స్థాయిలోకి వెళ్ళి పోయినాడు.

వెళ్లిపోదామా అని అడిగి అక్కడనుంచి నాతో బాటు లేచి గంభీరంగా వెంటనడుస్తున్నాడు; ఇంటికి తీసుకువెళు దామా అనుకున్నాను. ఎవరైతేనేం? ఏమో అతన్ని చూచిన కొద్దీ ఏలాగైనా నాశక్తిలో ఉన్నంతవరకూ ఎంత సాహాయ్య మైనా చేయదలచుకున్నాను. మన తాహతుక, లోకా న్నంతా బాగుచేయలేం కాని ఒక్క జీవుడిని కష్టండా టేటంత వరకూ కనిపెట్టలేమా లేకపోతే ఎందుకువచ్చిన సంపద?

వెళ్లిపోతానన్నాడు, నాతో కొంతదూరం వచ్చి. నే నేమి అనలేదు. అలాటి స్థితిలో ఆపడంకూడా భావ్యం కాదు. ఎవరూ లేనిచోటికి ఎక్కడికో పోయి ఏకాకి ... ఏడ్చి ఏడ్చి—అవును అంతే యేసురాయడనినట్లు ఎవరి సిలువ వారు మోయవలసిందే. తోడుపట్ట వీలులేదు. తలబరువు. కలిసి, తోడునడిచినా అడుగులకు అడ్డమేకాని అంతకు మించిన లాభం ఏమీలేదు.

సరే నన్నాను కలిగినది కాస్తో కూస్తో యిచ్చి. నే నెవరినో చెప్పి, ఎప్పుడేవేళనైనా అవసరం వచ్చినప్పుడు ఏమీ అనుకోకుండా నా దగ్గరకు రావచ్చునన్నాను. పరాయి వాడినని బిడియపడక సొంతవానిగా చూచుకోమన్నాను. మళ్లా ఎప్పుడు కనబడుతాడా అని ఎదురుచూస్తూ ఉంటాను. ఎప్పుడూ ఏలా ఉంటున్నాడో అని తలచుకుంటూ ఉంటా నన్నాను. పోయి రమ్మన్నాను.

—ఏమిటో మనసు పరిపరివిధాల వెఱ్ఱిగా వేదాంతం లోకి పోయి చెడుగుడాడుతూంది. అవును, లోకంలో యింత దుఃఖం పేరుకుపోయి ఉందని తెలిసేటప్పటికే కాదూ అమాంతం బుద్ధుడికి దిమ్మ తిరిగిపోయింది? అతడు అవతార మూర్తి గనుక అప్పటినుంచీ అన్నీ వదులుకుని లోకాన్ని దాన్నుంచెలా వదిలించడమా అనే ధ్యాసలో పడిపోయినాడు. మనలాటివాళ్లు ప్రాకృతులు ఆ క్షణానే ఆ ఆలోచనలుకాని యింకోదాంట్లో పడగానే అదంతా మరచిపోతారు. అంతే. అందరూ అందలం ఎక్కడానికి ఆస్కారం ఉందా?

ఆనుకోకముందే నేననుకోని-చోట ఆతను మళ్లా తగిలాడు. సినీమాకు సాయంకాలము మొదటి ఆటకు వెళ్ళి అనుకున్నంతకు రెట్టింపు పొడుగై చాలా పొద్దుపోవడంచేత అడ్డదోవ పట్టాను.

ఆ వీథిని నేను ఎన్నడూ సాధ్యమైనంతవరకూ వెళ్లను. అక్కడ నాలాటి మెత్తనివానికి అడుగడుగుకీ హంసపాదులు తగిలే భయంఉన్నది. ఏమీ లేకపోయినా, ఎవరన్నా చూస్తే ఎన్నివిధాలైనా అనుకుంటారు. చచ్చు చవకబారు సాని కూటం. నాలాటివాడు పరాకున అయినా ఆ చాయలకు పోరాదు.

నేను అక్కడకు అడుగువేసేటప్పటికి అతడూ సరిగా ఆ గుమ్మం గబగబా దిగి సిగరెట్ చివరదమ్ములాగి విసిరేసి నన్నుచూసి నిలిచిపోయినాడు. నాకు పలుకరించడానికి కృత్యాద్యవస్థ అయి ఆతని కంటబడటం మహాపరాధంక్రింద

కట్టుకుని యిరకాటంలో పడ్డాను, ఎటు మెసలడానికీ వీలులేక.

'రండి పోదాం' అని చనవుచూపి చేయిపట్టుకుని అడుగు వేయించాడు. వెనుకనుంచి యిందాకటి తలుపు తెరచిన కిర్రై), 'వెళ్ళిపోతున్నారా' అంటూ కొంచెం బొంగురుగా ఆడగొంతు పలికింది. 'ఆఁ' అని వీధంతా మారుమ్రోగే లాగు తల త్రిప్పకుండా వెనుకకు జవాబు విసిరాడు. 'ఇంకా కొంచెంసేపుండి పోతానన్నారు కాదండీ' అని నిలవేసే గదమాయింపుతో ఆ తెల్లచీర మెట్లుదిగి నన్నుచూసి సంకోచంతో నిలిచిపోయింది. నాకు కంపరం ఎత్తుకువచ్చింది: చిన్నతనం వదలక ముందు ఒకసారి యీ త్రోవనే పోతూంటే పట్టపగలు నట్టనడి వీధులో నుంచుని అదెవతో ... దండు సిపాయిలాగుంది.

'మా యింటికి రావయ్యా పంతులూ, అని చేయి పట్టుకుంది. నాకు ముచ్చెమటలుపోసి ఎలాగో విదిలించుకుని తిరిగన్నా చూడకుండా ఒక్కటేపరుగు! అంటే ఇంతకూ నేనేం మహామడిగట్టుకున్నానని చెప్పడానికి కాదు. ఏదో సంసారపక్షంగా ఎన్నడన్నా బుద్ధి మళ్ళినప్పుడు ఎన్ని మీనమేషాలో లెక్కచూసి, ఎన్నివరాలో కోరుకుని, ఎక్కడో అన్నివిధాలా మనకు సదుపాయం ఉన్నచోట; అంతే. నూటికీ కోటికేగాని చప్పున ఎక్కడబడితే అక్కడ జొరబడి హైరానయే కరకుతనంలేదు.

పంచతంత్రంలోనో దేన్లోనో పులి మింగడానికి గిలి వస్తూందంటే, కాలికి అంటగట్టుకునిఉన్న నక్కను యీడ్చుకుంటూ తోక ఝూడించిందని చదివానే. దానికి ప్రతిగా నడిచింది ఆ రంగం. ఏనుగంతసత్తువ తెచ్చుకుని ఆతని చేయి విడవకుండా లాక్కుంటూ పోయి రాజవీధిలో పడ్డానో పరమాత్ముడి కెరుక!

ఆయాసం తీరుతూండేసరికి వేడెక్కిన మెదడు పని చేయడం మొదలుపెట్టింది మళ్ళా.

అవునుపాపం! మానవుడే అతనేం దేవుడా? అయినా దేవతలన్నా భరించలేని బాధలకు తల ఒగ్గినాడు. ఆ పూట తింటే మరోపూట ఉండీలేకుండా ఆ అవస్థలో భార్యకు నెల మసలడం...సరే...యిటీవల జరిగిన ఘోరం...ఏదీ, అతనికి ఆ మాట అనుకునేందుకైనా అవకాశం? ఎంత మనసు సీరై పోయినా దేని తాపత్రయందానికి. పాడుశరీరం చెప్పినమాట వింటుందా! ఎంత మొగం వాచిపోయినాడో; నేను శకునపక్షిలాగా అక్కడ తయారుకాకబోతే తిరిగి లోపలికి బలవంతం చేసి అయినా లాక్కుపోయేది. తప్పక వెళ్ళేవాడు. సిద్ధాన్నం చెడగొట్టాను. చెడగొట్టానా నేను? ఒకవేళ, పైసా ఖాళీ అయిపోయి అందుకని వచ్చేశాడేమో? ఆలాగైతే అది మన చేతుల్లోఉన్న పనేగా.

పర్సుతీశాను జేబులోంచి. ఆతడు అంతలో ఆకలిగా ఉన్నదంటే సింగుకొట్టుమీదకు వెళ్ళి మిఠాయి, టీ యిక రాత్రికి భోజనాపేక్ష అంటూ లేనంతగా గబగబ పుచ్చు

కొన్నాం. వచ్చి కోనేరు మెట్లమీద కూర్చుని చెరో సిగరెట్టూ ముట్టించాం.

'బ్రదర్ లోకంలో యింతమంది ఫూల్సు ఉంటారని నేను యిదివరకు ఎవరన్నా చెప్పినా నమ్మేవాడిని కాను.' ఎత్తుగడ నాకు ఎంతమాత్రమూ అర్థంకాకపోయినా, ఏమిటో ఆతడనేది, ముందైనా తెలుస్తుందికదా అని మాటకు, మాట వరుస కలిపాను. ఊరికే యింకొకటి: నా విషయంలో, విధేయత ఆ నిమిషందాకా చూపిస్తూన్నవాడల్లా అంతలో అంత చనువు తీసుకోవడం వెగటుకాకపోగా సరదాగా ఫీలయినాను, చాలా.

'ఎంతమంది ?'

'ఎందరో! కాని, అందరినీ మించిపోయినావు నీవు. నీ ముఖం ఎదుట నిన్ను పొగడటంకాదు, నిజం చెపుతున్నాను.'

ఏమిటి, ఆతనికి యిన్ని బెడదలూ చాలక మతికూడా చలించిందా? అనుకున్నాను. ఆతని నేమనడానికి నోరు రాలేదు. ఆతని నోరు మూతపడలేదు.

ఉన్నవాడిని ఉన్నట్టుండక యింత గ్రంథంలోకి ఎందుకు దిగానంటే అయిదారు రోజులక్రింద, నా అదృష్టవశమున 'వందేమాతరం' చూడటం తటస్థించింది. చూసినతరువాత పట్టభద్రుడు పని దొరక్క బస్తాల మోతలోకి దిగడం యిత్యాదులు మనవాళ్ళ మనసును ఎంతవరకూ ఊపుతాయీ అని ఆలోచించి తమాషాకోసం ఒక సంపన్నగృహస్థు దర్శనం

చేసి, సినిమాలో కథ అప్పటికి అవసరం ఉన్నంతవరకూ, మైనస్-సీసపద్యాలనుకో, 'మమ' అని ఆయన ఎదుట అతి జాలిగా అభినయించేసరికి ఆ మానవుడు పాపం టార్రై పోయి... అతడూ గడచి బ్రతికినవాడేనట!... నన్ను ఆదరించి అంతో యింతో చేతులోపెట్టి ఎక్కడన్నా పని దొరికేవరకూ పొదుపుగాచూసి వాడుకుంటూండమనీ, ఎల్లకాలమూ చీకటే ఉండదనీ ఎక్సెటరా కలగూరగా ఓ గంపెడు వేదాంతం నెత్తికెక్కించి సెలవిచ్చాడు. వెళ్లిపోతూ... అన్యాయమేగాని... ఆరిఫూలా! అని మనసులో ఆశీర్వదించాను. అలా అనిపించింది.

నన్నుచూశా...నా కథలో తొణికిన లోక దౌర్భాగ్య స్థితినిచూసా... లేక వెనుకటి తన బాధ తలుచుకునా...ఎది అతన్ని అంతగా కదలించింది?

మొదట లేవుగాని కార్యంలోకి దిగేటప్పటికి యిన్ని రకాల సందేహాలు వేసినవి. భాణీ మారుద్దా మనుకున్నాను.

కాచుకు నిలుచున్నాను, వచ్చేపోయేవారి వాలకమంతా చూస్తూ, నీవు కనిపించావు. దొరికాడురా అని పథకం వేశాను. అది ఖచ్చితంగా పడ్డది. ఆపూట పర్సు ఖాలీ చేశావు. అవును. ఆడకూతురు అన్నివిధాలా ఆలాటి అవస్థలో ఉన్నదని అంతటికీ కారకుడైనవాడే ఎదుటబడి గుండె తరిగిపోయేటట్టు చెపుతూంటే 'అయ్యో?' అని అనుకోని గృహస్థు ఉంటాడా, ఏ తలకుమాసిన వాడో కాని? అందులో చూశానుకదా, నీ చేతికి ఎముక లేదు; అందుకనే

అందరినీ మించిన ఫూల్‌వు నీవు. లేకపోతే, ఏం అందరిలాటి మనిషినీ కానూ నేను? చదువుకుంటే, సత్కులమువాడి లాగా కనబడితే, ఎక్కువేమన్నా జరిగిందా? దోవనపోయే ప్రతి బిచ్చగాడూ నిన్నిలా దోచుకుంటున్నాడా?

ఈ దెబ్బతో అసలైన ధర్మసూత్రం గోచరించింది. మనవల్ల మనవాళ్లు ఎంతబాధపడుతున్నారో కన్నులకు కట్టజేస్తే అప్పుడు మన దుర్దశకూ, మనకూ మరీ విలువ హెచ్చుతుంది. మన వాళ్ళకు, మనకు లోకైన ఛాయా అందు కుంటుంది.

అర్థం అయిందా!

'నాకు అర్థం అయిందికాని అంతటితో ఆ వ్యాసంగం చాలిద్దామనుకుంటే అడుగడుక్కీ నీవు తగలడం, నీ కోసం మళ్ళీ కథ పెంచడం, ఇలా అయితే నీ సత్తువ సన్నగిలేటప్ప టికి నేను కాశీ మజిలీలను మించిన గ్రంథం నడపాలిసి వస్తుంది. ఇక ఇంతతో చాలిద్దాం...ఆడటానికి...నాకు ఓపికా లేదు, తీరుబడీ లేదు.'

న్యాయంగాపడితే...అప్పుడా పట్టున అతన్ని పట్టుకుని ఎగాదిగా చెక్కేయవలసింది...అంత కోపం రాకపోగా ఆ బాధలన్నీ అతడు పడలేదుగదా అని మనసు తెరిపిన పడ్డది. అయినా ఆ భావం ముఖంలో కనపడనీయకుండా 'అన్నీ అబద్ధాలేకదూ?' అని గదమాయించాను.

'నేను చెప్పినవి అన్నీ ఆహాః. అదే నేను యిందాకా మనవి చేస్తూన్నది, నీవు చూచినది అంతా...సరి...నిజమే కదా.'

'అయితే నేను చేసింది అంతా బూడిదలో పన్నీరు.'

'అది పన్నీరే. ఇది బూడిదకాదు గులిస్థాన్. నేను రాసేవన్నీ అబద్ధాలు కాదూ! అందుకోసం అచ్చువేసుకునే వాళ్ళు అవన్నీ కళ్ళకద్దుకు తెలిసే కొనుక్కోవడంలేదూ? యిప్పుడు యింత ధర పలికించానంటే, అవును, యిది నీకే కాపీరైట్. అవునుగాని నీవు ఇంకొకటి కూడా, ఆలోచించు. నిజంగా నేను నీదగ్గిరకువచ్చి...నేను ఎవరైతే నీకేం; నాకు సరదాగా ఖర్చు పెట్టుకునేందుకు డబ్బుకావాలి. అవసరం ఏమీ లేదుగాని ఊరికేనే తగలేయడంకోసం' అని యథార్థం చెపితే నీవు ఏమన్నా చోటు పెట్టేవాడివా? నీచుట్టూ ఎన్ని సారులు తిరిగినా ఏగానీ అయినా రాలేదా? యిప్పుడుచూడు నీవు నే నేమైపోతానో ఏమో అని నా వెంటబడి ఎన్నివిధాల కనపెట్టావు? అదే తేడా. కన్యాశుల్కంలో చెప్పినట్టు 'ఎంపికలో ఉంది.'—

ఆతడవు నన్నది కాదనగల తాహతులేక, ఉడికిలి, రోషంతో.

'అంటే అందరూ నీ వనుకునేటంతటి ఫూల్సుకారు; కొందరికైనా, హృదయం ఎదుటివాళ్ళనుచూస్తే జాలి'.

'అవి అందరికీ నిజంగా ఉండాలి. సోదరా! కాని, ఉన్నవికదా అనే ఉబలాటం తీర్చుకునేందుకు ... ఒక్కటి

చెపుతా విను ... పలుపూ పందిలిగుంజా పడివున్నాయికదా, దైవం యిచ్చాడుకదా అని ఎవడన్నా వచ్చి దేవరతో దున్న పోతు యీనిందయ్యా! అంటే, వినేవినడంతోనే దూడను చూడకుండా కట్టేయమని చెప్పవద్దు. చెప్పావో, అలా చెప్పగా చెప్పగా పశువులు లేకపోవడంమాట అటుండగా పందిలిగుంజ సహితం నిరంతరం దానధారకు తట్టుకోలేక చీకిపోతుంది.'

ఫక్కున నవ్వాను. నవ్వక చేసేదేముంది.

'నవ్వావో, మాలాంటి నాపచేలు పండుతవి.'

'పండినా మేము మీ దృష్టిలో ఫూల్సుమే'.

'ఫూల్సు పండినకొద్దీ మా పంట పండుతుంది. రైతు దేశమునకు వెన్నెముక వంటివాడని కిసాన్ సోదరు డొకడు సాయించాడు. మాలాంటి సరదాలున్న కుర్రకుంకలకు మీవంటి ఫూల్స్ జీవకర్రలు. ఆదిలో తాళంకూడా కుదిరింది. చూశావూ మీరు యిలాగే ఉండక తప్పదు.

'ఇక కథ కంచి రైలందుకు నేందుకు పరుగెత్తబోతూంది. నీ వింక మరలి నిజమందిరమునకుంజని అనేక దివ్యవర్షంబు లీరీతిన ప్రజాహితకార్యంబు లాచరించుచూ మనెదవు గాతమని గుడ్ బై. నేను లాడ్జికి వెళ్ళి స్నానంచేసి...పాడుమాట లాడినందుకు...రాత్రికి వెళ్ళిపోతాను. మళ్ళా మనసు తిరిగితే ఇంక ముందెన్నడైనా అద్దైనా నీ ముద్దు చెల్లించడానికే రావచ్చును. కాచుకో—?'